
# మహానగరం కథలు

## -వేదుల సుభద్ర





# స్ఫురితం

*మహానగరం కథలు*

**ఢిల్లీ, బొంబాయి, బెంగుళూర్, హైదరాబాదు, లండన్, పారిస్, న్యూయార్క్. పేరేదైనా, స్వదేశమైనా, విదేశమైనా.** ఉన్నది ఎక్కడైనా, తీరు, తెన్నూ ఒకటే.. ఆకాశాన్నంటే మేడలూ. ఇబ్బడి ముబ్బిడిగా పెరుగుతున్న వాహనాలూ, జనాభా, మారుతున్న ప్రజలూ, తరుగుతున్న వనరులూ మానవతా విలువలూ, రోజురోజుకీ చేరుతున్న ఊహకందని మార్పులూ, ఎటువైపో తెలియని జీవన పయనాలు.వెరసి. గజిబిజి బ్రతుకుల ఉరుకుల పరుగులతో .. మహానగరాలన్నీ "యమహా" నగరాలవుతున్నాయి.

కాలుష్యమూ, యాంత్రికీకరణా, మెటీరియలిజమూ, స్వార్థమూ, మనుష్యులమధ్య పెరుగుతున్న దూరాలూ, ఆర్థికసంబంధాలే జీవిత సంబంధాలనుకునే రోజులూ ... ఇవేనా నగరాలలోకనిపించేది? ఇంతకు మించి మరేమీ లేదా? కాదు.. తరచి చూస్తే ఆవేశాలూ, ఆనందాలూ, పురోగమనాలూ, బాంధవ్యాలూ, పోటీ తత్వాలూ, గెలుపిచ్చే సంతోషాలు. పంచుకుంటే పెరిగే సుఖాలూ మాట విరుచుకుంటే మిగలని సంబంధాలూ, వెతలే కాదు.. కతలూ కనిపిస్తాయి..

అత్యంత సంపన్నులూ, అతి నిరుపేదలూ కలిసి ఆకాశమనే ఇంటికప్పుకింద కలిసి చేసే సహజీవనాలే మహానగరాలు. ఓపికుండి వింటే సాలభంజికలని మించి చెప్పే కథా సాగరాలు. నిత్యం మారుతున్న మన రోజువారీ జీవన చిత్రాలు.. ఈ మహానగరం కథలు..!!

ఆఫీస్ గడియారం ఆరు చూపించగానే బాగ్ సర్దుకుని లేచి నిలబడింది స్ఫురిత. "స్ఫూ లేచిందంటే ఆరయిందన్నమాటే?"అంది వీణ పక్కనించి.

"వీణా, నన్ను 'ఫూ, స్ఫూ' అనద్దని నీకెన్నోసార్లు చెప్పాను, నా పేరంటే నాకెంతో ఇష్టం, మరెవరైనా అంటే పరవాలేదు కానీ, 'వీణ 'అన్న పేరున్న నువ్వు అలా పిలవడం అస్సలు బావుండదు. " అంటూ నవ్వి బయలుదేరింది.

స్ఫురిత తండ్రి వెంకటేశ్వర్లు పెద్ద వైణిక విద్వాంసుడు, గుంటూరు సంగీత కళాశాలలో వీణ అధ్యాపకుడిగా పనిచేస్తారు. అమ్మ వైదేహి కూడా పాడుతుంది. ఆయన ఎంతో ప్రేమగా పెద్ద కూతురికి ముద్రిత అని, చిన్న అమ్మాయికి స్ఫురిత అని పేర్లు పెట్టుకున్నారు. అవి కర్నాటక సంగీతంలోనూ, వీణా వాదనంలోనూ వినిపించే గమకాల పేర్లు.

అక్కచెల్లెళ్ళు ఇద్దరూ కూడా వీణ చక్కగా వాయిస్తారు, పాడతారు. స్ఫురితకి మొదటినించీ ఉద్యోగం, వ్యాపారాలకంటే సంగీతంలోనే ఉండాలనినీ, కచేరీలు చేసి పేరు ప్రఖ్యాతులు తెచ్చుకోవాలనీ కోరిక. ముద్రిత బీ.ఈడీ చేసి అక్కడే టీచర్గా పనిచేస్తోంది. వాళ్ళ ఇంట్లో దాదాపు రెండు గదులనిండా రకరకాల వీణలు, తంబూరాలు, హార్మోనియం, శృతిపెట్టెలూ ఇలాంటి సామాన్లే ఉంటాయి. అంతే కాదు, వాళ్ళ ఇంట్లో మాటలూ, పాటలే కాదు ఆటలు కూడా సంగీతంచుట్టూ తిరుగుతూ ఉంటాయంటే అతిశయోక్తి కానే కాదు.

'కళ్యాణి రాగంలో వచ్చే మధ్యమం శుద్ధ మధ్యమమా? ప్రతి మధ్యమమా? ' అని చిన్నప్పుడు ఆడుకుంటే, ఇప్పుడు పెద్దవాళ్ళయ్యాకా, 'దశవిధ గమకాలున్న కీర్తన వాయించి చూపించు, శంకరాభరణం రాగంలో గ్రహబేధం చేసి ఐదు మేళకర్త రాగాలు వాయించు ' అని ఆడుకుంటారు.

బయోటెక్నాలజీలో ఇంజనీరింగ్ చదివిన స్ఫురిత ఈ మధ్యనే బెంగుళూరులోని ఒక బయాలజీ కంపెనీలో చేరింది. ఉద్యోగం కోసం మొదటిసారి తల్లితండ్రుల్నీ, సొంత ఊరినీ వదిలి రావడం, బెంగుళూరులాంటి నగర వాతావరణానికి అలవాటు పడటం రెండూ కష్టంగానే ఉన్నాయి స్ఫురితకి. అదృష్టవశాత్తు వైదేహి చెల్లెలు వాణి ఇంట్లో ఉండటం వల్ల కొంత వరకూ నయమే, పిన్ని పిల్లలు రేఖా, సందీప్లతో కాలక్షేపం, ఇంటి భోజనం వల్ల బెంగ కొద్దిగా తగ్గుతోంది. కానీ రోజూ తప్పకుండా తండ్రీ, అక్కలతో కలిసి చేసే సాధననీ, తను పుట్టి పెరిగిన వాతావరణాన్నీ చాలా మిస్ అవుతోంది.

రేఖా, సందీప్లని చిన్నప్పుడు స్కూల్కి తీసుకెళ్ళిన ఆటో డ్రైవర్ ప్రకాష్ రోజూ స్ఫురితని టైముకి తీసుకెళ్ళి తీసుకొస్తాడు. కొద్దిగా అలవాటు అయ్యేవరకూ ఇది బాగానే ఉంది అనుకుంది.

ఆటో డ్రైవర్ ప్రకాష్ ఎంతో సరదాగా కలుపుగోరుగా ఉంటాడు, వచ్చిన నెలరోజులకే స్ఫురితకెంతో దగ్గరైపోయాడు. తల్లి, భార్యా, ఇద్దరు పిల్లలూ, అతని కుటుంబం.

వాళ్ళ నాన్నగారి స్నేహితులు సంగీత విద్వాంసులు చాలామంది బెంగుళూరు, మైసూరు, చెన్నై లలో ఉన్నారు. వారి ద్వారా శాస్త్రీయ సంగీతాన్ని ఎంతో ఆదరించి, అభిమానించే ఈ నగరాలలో తన పిల్లలకి మంచి అవకాశాలు వస్తాయని ఆయన ఆశ. ముఖ్యంగా సంగీతాన్నే కెరీర్గా మలచుకోవాలని అమితంగా ఆశ పడే స్ఫురిత కోసం. అందుకే తను రిటైర్ అయిన వెంటనే తాము కూడా ఇక్కడకే రావాలని ఆయన ఆలోచన.

ఆఫీస్ లో వీణతో తన పేరు ప్రస్తావన వచ్చినప్పటినించీ తండ్రికీ, తనకీ జరిగే సంభాషణే గుర్తుకువస్తోంది స్ఫురితకి. ఆటోలో కూర్చుని అదే ఆలోచిస్తోంది.

" నాన్నా, నాకింత మంచి పేరు పెట్టాలని మీకెలా తోచింది? " అని అడిగింది ఒకసారి.

" నాకు ఊహ తెలిసినప్పటినించీ నాకు తెలిసినదీ, నేను చూసినదీ ఈ సరస్వతీరూపం మాత్రమే. ఏ రోజున మా నాన్న నా చేతిలో ఈ వీణ పెట్టారో నాకు నిజంగా గుర్తు లేదు కానీ, అప్పటినించీ ఇదే నా జీవితమైపోయింది. ఎన్ని రాగాలో, ఎన్ని స్వరాలో, ఎన్ని గమకాలో, ఇవన్నీ నాకు ప్రాణం. ముఖ్యంగా గమకాలు, "అలంకారం "అని అర్థం చెప్పుకోగల ఈ గమకాలు నిజంగానే సంగీతానికి అలంకారాలు.

వీటి వల్ల వీణానాదానికీ, సంగీతానికీ, ఎంత సొగసు, నిండుదనం వస్తాయో మీకు తెలియనిది కాదు, అందుకే గమకాలంటే నాకు మరింత ప్రత్యేకమైన ఇష్టం. అందుకే మీ ఇద్దరికీ ఆ పేర్లు పెట్టుకున్నాను. నీకు తెలుసా తల్లీ, స్ఫురితం సరిగ్గా వాయిస్తే ఎంత అందంగా ఉంటుందో చెప్పడం కష్టం. వచ్చీ రానట్టూ, వినిపించీ వినిపించనట్టుగా, ఆరోహణలో స్వరాల్ని పలికించే ఈ ప్రక్రియచాలా ప్రత్యేకంగా వినిపిస్తుంది కదూ, అచ్చు మా చిట్టి తల్లిలాగే. వినిపించని రాగాలతో కనిపించే అందాలు. నీకెంతో ఇష్టమైన పాట " అన్నాడు నవ్వుతూ.

చదువుకున్న అమ్మాయిలు చిత్రంలోని 'వినిపించని రాగాలే' అన్న పాట అంటే స్ఫురితకి చిన్నప్పటినించీ ఎంతో ఇష్టం. ఎన్నో పాటలు నోటికి వచ్చినా సరే, చాలా సార్లు ఇదే పాట పాడేది. ఇంట్లో కూడా ఎప్పుడు కూనిరాగం తీసినా అదే వస్తుంది తొందరగా - ఆమెకి.

"వినిపించీ వినిపించకుండా పలికే గమకం పేరు పెట్టారు కదా, అందుకే ఎప్పుడూ ఈ పాటే పాడుతుంది అని అక్క వెక్కిరించేది.

"అదేం కాదులే, వినిపించే రాగాన్ని అందరూ ఆస్వాదిస్తారు, వినిపించని రాగాల్ని తెలుసుకోవడంలోనే ఉంది మజా, సంగీతంలోనే కాదు జీవితాల్లోనూ ఎన్ని వినిపించని రాగాలో, ఒక మీట నొక్కితే జంటగా పలికే స్వరాలో, అదే స్ఫురితాలో అంటూ మళ్ళీ కూనిరాగం తీసేది. "

"అబ్బో, వేదాంతం చెప్తోంది నాన్నా !"అని నవ్వేది అక్క.

ఆ సంభాషణ గుర్తుచేసుకుంటూ చిన్నగా నవ్వుకుంటూ అప్పుడు గమనించింది ప్రకాష్ రోజులా హుషారుగా లేకపోవడాన్ని. ఈ ఆరునెలల్లోనూ ఇంత డల్‌గా ఎప్పుడూ కనిపించలేదు అతను.

"ఏమయింది ప్రకాష్? ఈ రోజు ఎప్పటిలా హుషారుగా లేవు. ఇంట్లో అంతా బావున్నారా? ఒంట్లో బావులేదా? "అని అడిగింది.

" లేదమ్మా, బానేఉంది"అన్నాడు, నవ్వడానికి ప్రయత్నిస్తూ.

ప్రతీరోజూ రోడ్డుమీద జరిగినవో , లేకపోతే ఇంట్లో జరిగినవో ఏవో విషయాలు చెప్పడమూ, నవ్వుతూ, నవ్విస్తూ ఉండే ప్రకాష్ ముభావంగానే ఆటో నడపడం చూసి,

" ఏదో ఉంది, ప్రకాష్, నీకు బాగో లేకపోతే చెప్పు, ఇంకో ఆటోలో వెళతానులే మరేం పరవాలేదు " అంది.

"లేదమ్మా, రెండు రోజులుగా నిద్ర లేదు సరిగ్గా, అందుకే కొంత నీరసంగా ఉంది. " అన్నాడు.

ఎక్కువగా తర్కించలేదు స్ఫురిత.

ఆలోచిస్తూ, దిక్కులు చూసుకుంటూ కూర్చుంది. ఆటో పెద్ద షాపింగ్ రోడ్డైన ఇందిరానగర్ 100 అడుగుల రోడ్డుమీద వెళ్తోంది. చలికాలం కావడం వల్ల తొందరగా చీకటి పడిపోతోంది, అందుకే ఆరున్నరకే అన్ని దుకాణాలు నియాన్ లైట్ల కాంతులతో, రవ్వల నగలు దిగేసుకున్న అమ్మాయిల్లా మెరిసిపోతున్నాయి. అది కాదు స్ఫురిత చూస్తున్నది, దాదాపు ప్రతీ షాపు ముందూ పెద్ద పెద్ద బోర్డులు. "సేల్" అంటూ. 10 నించీ, 70 శాతం దాకా, రకరకాల డిస్కవుంట్ల బోర్డ్ లు రోడ్డు మీద ఊరికే నడిచి వెళుతున్న వారిని కూడా లోపలకి లాగేస్తున్నాయి.

"అశ్వత్థామ హత:" అన్నట్టుగా "అప్టూ" అన్న పదం చాలా చిన్నదిగా కనీ కనిపించనట్టుగా రాస్తారు. మొదటిసారి ఈ ఊరిలో బోర్డ్‌లు చూసి తను కూడా ఇంత డిస్కవుంటా? అని ఆశ్చర్యపోయినప్పుడు తమ్ముడు సందీప్ చెప్పాడు. "అక్కా! పైన "అప్టూ" అని ఉంది చూడు, అంటే అది ఎంతైనా కావచ్చు, లేదా యాభై శాతం డిస్కవుంట్‌లో మూడో, నాలుగో బట్టలుండవచ్చు అని. లోపలకి వెళ్ళి చూస్తే అది నిజమే అని తేలింది. అప్పటినించీ ఇలాంటి బోర్డ్ లు చూసినప్పుడల్లా స్ఫురితకి నవ్వు వస్తుంది. ఈ మహానగరాల్లో ఇవన్నీ వినిపించని రాగాలే అనుకుంటుంది. అమ్మా, నాన్నలతో చెప్తూ ఉంటుంది. ఇప్పుడు ఇక్కడా వస్తున్నాయి ఇలాంటివి" అంటుంది అమ్మ.

"అమ్మా, ఇంటికి వచ్చేశాం" అన్నాడు ప్రకాష్. "ఈ నెల డబ్బు ఈ రోజు ఇచ్చేస్తారా?" అన్నాడు చిన్నగా. ఎప్పుడూ నెలకొకసారి తీసుకుంటాడు ఎంత చెప్పినా సరే, అలాంటిది నెల ముగియడానికి ఇంకా వారం ఉండగానే అడుగుతున్నాడు.

"పాపం ఎంత అవసరమో, ఏమో ? " అనుకుంటూ, "ఒక్క క్షణం", అంటూ ఇంట్లోకి వెళ్ళి డబ్బు తెచ్చి ఇచ్చింది.

"ఏమయింది ప్రకాష్? ఇంట్లో అంతా బావున్నారా? ఇది చాలా, ఇంకా కావాలా? పిన్నిని అడగనా " అంది కొంచం ఆత్రంగా.

" వద్దులేమ్మా, రేపు శనివారంగా, ఆఫీస్ కి పోవాలా ? " అన్నాడు.

" వద్దులే, రేపేమీ పని లేదు " అంది తనే.

" అక్కా, పాలక్ పనీర్ అంటే ఏంది?ఎట్లా చేస్తారో కొంచం చెప్పు అంది " పని అమ్మాయి సుమిత్ర గిన్నెలు కడుగుతూ వాణి పిన్నిని అడుగుతోంది.

" పాలక్ పనీర్ అంటే రొట్టెల్లోకి తినే కూర, ఉత్తరాదిన బాగా చేస్తారు, రేపెప్పుడైనా చేసినప్పుడు ఇస్తాలే " అంది వాణి పిన్ని చిన్నగా నవ్వుతూ.

" లేదులే అమ్మా, ఎట్లా ఒండేది చెప్పెసెయి నాకు, ఈ రేత్రికే వొండేస్తా " అంది సుమిత్ర ఆత్రంగా. సరే అని, ఎలా చెయ్యాలో చెప్పింది. " ఇప్పుడంత అర్జంటేం ఆ కూరకి ?" అడిగింది చిరునవ్వుతో. మంచినీళ్ళు తాగుతూ వీళ్ళిద్దరి సంభాషణ వింటోంది స్ఫురిత.

"అబ్బో చెప్పాలంటే పెద్ద రామాయణమే ఉన్నాదక్కో! మా ఇంటెదురుగా ఉండే పిల్ల ఈ మధ్య పదో క్లాస్ అయిపోయినంక మెయిన్ రోడ్ మీదున్న హోటల్‌లో పనికి కుదురుకుంది. పొద్దున్నే ఎనిమిది గంటలనింకా, మూడుగంటలదాకా డూటీ అంట. కూరగాయలు కోసి ఇచ్చేది, గిన్నెలు అవీ కడిగేది, మద్దానం అదేదో బుఫె భోజనం ఉంటాదంట. ఆఫీసులోల్లు వచ్చి బేగే తినేసి ఎల్లడానికి ఈలంట. అది అయినంక మిగిలిన కూరలు, పప్పులూ, రొట్టెలూ అక్కడ పనిసేసేవోల్లకి ఇస్తారంట, రేత్రికి ఈ బుఫే ఉండదంట.

ఆ పిల్ల అప్పుడప్పుడు ఇలాంటి కూరలు అయ్యా ఇంటికి తెస్తా ఉంటంది, తాను తిని ఊరుకోక మొన్న నా బిడ్డ ఆడకి పోతే దానికి పెట్టింది, అప్పటి నించి ఇది ఒకటే గోల. ఈ దినం పనీర్ తెమ్మని ఆళ్ళ అప్పకి సెప్పినా, చిన్న ముక్కలాగుందమ్మా, అరవైరూపాయలంట, ఆళ్ళ నాన్న ఒకటే గోల. ఇప్పటికి ఇద్దరికీ, స్కూళ్ళకీ, ఫీజులకే ఇంత కర్సవుతుంటే ఇంక ఇయన్నీ ఎక్కడనించి తెచ్చేది అని నా మీద ఇసుక్కుంటన్నాడు? బిడ్డలకి ఆళ్ళు అడిగినవి తినిపించనీకి కూడా కష్టమే అవుతున్నాది. ఆళ్ళు మాటినరు, ఆళ్ళ నాన్న వినడు. ఏం చెయ్యాలో ఏటో, మంచూరి, కడ్డీ పనీర్, కబాబులు ఇలా రోజూ ఏదో ఒకటి పిల్ల ఈళ్ళకి సెప్పడమూ, ఈళ్ళు ఇంటికొచ్చి ఒకటే గలాట సెయ్యడమూ, బేజారవుతాందనుకో అక్కా, ముందే నయం. ఇద్దరూ పొద్దున్నే మాటాడకుండా అన్నమూ, రాత్రికి రాగి ముద్దలూ తినేవోరు. ఒకటికొకటి సేరి కర్సులు జాస్తి అవుతున్నాయి అని మా ఇంటాయనకి కోపం" అంది సుమిత్ర.

కోలార్ దగ్గరేదో చిన్న పల్లెటూర్లో పూల తోటల్లో పనిచేసి బెంగుళూరు లోని కే.ఆర్ మార్కెట్‌కి టోకున పూలు సరఫరా చేసేవారు సుమిత్ర భర్తా, అతని స్నేహితులూ. ఒకరి ప్రోద్బలంతో మరొకరు బెంగుళూరు వచ్చి ఇక్కడ అదే మార్కెట్లో పూలు కొని చిల్లర

వ్యాపారం చెయ్యసాగారు. అక్కడ ఇంటిపట్టున ఉండి పిల్లలని చూసుకునే సుమిత్ర ఇక్కడ నాలుగిళ్ళల్లో పనికి చేరింది, పెరుగుతున్న ఖర్చులు భరించడానికి. వారానికి ఒకసా రి పొద్దున్నే మూడుగంటలకేనిద్ర లేచి మార్కెట్ కి వెళ్ళివస్తుంది, గురువారం ఎక్కువ పూలు కావాలి కనక. తను చేసే ఇళ్ళల్లో పనీ, తన ఇంటి పనీ, పిల్లల పనీ , వీటన్నింటి మధ్యా చాలా అలిసిపోతోంది ఈ మధ్య.

" ఒక కూరే కదా, ఒక రిబ్బనే కదా, ఒక సబ్బుబిళ్ళే కదా అనుకుంటా పోతే ఎక్కడ ఆగేదీ తెలవటమే లేదక్కా, ఊరిలో ఉన్నప్పుడేసక్కగుండేది, ఈడికొచ్చినాక అన్నీ కర్సులే, దినమూ గొడవలే ". అన్న సుమిత్ర మాటలు చాలాసేపు గుర్తొచ్చాయి స్ఫురితకి. బస్తీ బ్రతుకు మీట నొక్కితే పక్కనే వినబడే స్వరాలివి. " వినిపించని రాగాలే " పాట అప్రయత్నంగానే పెదవులమీదకి వచ్చి చేరింది.

సోమవారం పొద్దున్నే వచ్చాడు ప్రకాష్. "అలా ఉన్నావేం? ఒంట్లో బాగోలేదా? అని అడిగింది పిన్నివాణి, అతని వాలకం చూస్తూనే.

"లేదమ్మా, బాగానే ఉంది, కొంత డబ్బు అవసరం పడి నిన్నా, మొన్నా రాత్రి కూసింత ఎక్కువసేపు తోలినా ఆటో, దాంతో నిద్ర కాస్త తక్కువయింది. అన్నాడు.

"డబ్బు కావాలా? నన్ను అడగొచ్చుగా? అంది స్ఫురిత.

"నిన్ననే ఇచ్చేశారు కదమ్మా, ఇంకా ఏంటి? ఇవన్నీ రోజూ ఉండేవే, కాకపోతే ఈ మధ్య కొన్ని కర్సులు కొత్తగా చేరతన్నాయి " అన్నాడు.

"చిన్నాడిని స్కూల్లో ఎయ్యాలి, ఇరవై వేలంట ఫీజు, అది చాలనట్టు పెద్దది సినిమా, సినిమా అని గొడవ సేయటం మొదలెట్టింది. , దానికి ఒక్కటే తెరున్న సినిమాహాల్లో సినిమా వద్దంటమ్మా, మా బస్తీ పక్కనే పెద్ద షాపింగ్ కాంప్లెక్స్ కట్టారు కదమ్మా, అందులో మల్టిప్లెక్స్ సినిమాలంట, అయ్యి కొత్తగా పెట్టినారు. దాంట్లోనే కావాలంట, అది కూడా హిందీ సినిమా, దాని స్నేహితులంతా చూసేశారంట 'క్రిష్ 'అంట సినిమా పేరు, చూస్తే దాన్ని , ఏ.సీ హాల్లో, గొప్పగా సౌండ్ వచ్చేట్టు చూస్తేనే మజా అంట. ఈ నెలకూరుకో, తమ్ముడి ఫీజ్ కట్టాలి, నాయనమ్మకి మందులిప్పించాలి కదా అంటే ఇల్లూ, వాకిలీ ఏకమయ్యేట్టు ఏడ్చింది. దాన్ని చూసి మా యావిడ ఒకటే గోల "మీ అమ్మకి మందులకి డబ్బులుంటాయి గానీ, బిడ్డ అడిగినదివ్వడానికి ఉండవు" అని ఒకటే నస. నిన్న దాని పుట్టినరోజు, రాత్రి సినిమా చూపిస్తే ఓ గోల తీరుతుంది కదా అని తీసుకుపోయినా "అన్నాడు.

ఒక తండ్రిగా పిల్ల అడిగిన కోరిక తీర్చాలన్న ఆశ ఎంత ఉందో, ఇలాంటి అక్కరలేని ఆడంబరాల వల్ల వస్తున్న ఇబ్బందుల పట్ల అసహనమూ అంతే ఉంది అతని గొంతులో.

"పోనీలే, చిన్నపిల్ల కదా "అంది స్ఫురిత ఏమనాలో తెలియక.

"చిన్నపిల్లేనమ్మా, అందుకే కాదనలేక ఇలాంటియన్నీ సెయ్యడం, పెద్దదాన్ని ఒక్కర్తినీ ఇంట్ల ఉంచలేక, అమ్మనీ తీసుకెళ్ళాము. కొత్త సినిమా అంట, ఆదివారాలు వేరే రేటంట. ఐదు టిక్కట్లకీ 1250 రూపాయలయిందమ్మా, ఆడ పిల్లలందరూ కొనుక్కుంటా ఉంటే ఈళ్ళకీ పాప్‌కార్న్, పెప్సీ కొనిచ్చినా, దానికింకో మూడొందలూ, నా సిన్నప్పుడు అర్థ రూపాయిస్తే బెంచీ టిక్కెట్‌టొచ్చేది, ఆరోజులకీ, ఈ రోజులకీ పోలికే లేదు. " తనలో తనే అనుకున్నట్టుగా అన్నాడు.

"సినిమాకి డబ్బులు మరే ఇతర అవసరానికో దాచిన వాటిల్లోంచి తీసి ఖర్చు పెట్టాడేమో, పాపం అందుకే రాత్రికూడా ఎక్కువ సేపు ఆటో నడిపి ఆ లోటు తీర్చుకోవాలని చూస్తున్నాడన్నమాట "అంది సంగతి విన్న వాణి పిన్ని.

"అవును పిన్నీ, పాపం "అంది. స్ఫురిత.

"ఈ మల్టీప్లెక్స్‌లు వచ్చాకా, సినిమాల్లో తారలేమో కానీ సినిమా చూడాలంటేనే చుక్కలు కనిపిస్తున్నాయి, మనలాంటివాళ్ళకే. మేము నలుగురం సినిమాకి వెళ్తే ఇంచుమించు రెండువేలనుకో. చిన్నప్పుడు నేనూ, మీ అమ్మా, మావయ్యా 'మనకెవరైనా రెండువేలిస్తే

ఇంచుమించుగా ఏడాదంతా రోజుకోసినిమా చూసేయచ్చు అనుకునేవాళ్ళం , అప్పుడు మేం ముగ్గురం వెళితే కూడా మాకు ఐదో, ఆరో రూపాయలయ్యేది మేముండే పల్లెటూళ్ళో" అంది వాణి.

ఇంతలో హాల్లోని ఫోన్ మోగింది.

"హలో బావగారూ, బావున్నారా?" చెప్పండి. అంటూ వాణి మాట్లాడడం మొదలు పెట్టగానే అది తమ ఇంటినించే వచ్చిందని స్ఫురితకర్థం అయింది.

"ఓ అలాగా, వెరీగుడ్, చాలా బావుంది " అంటూ పిన్ని సంబరంగా మాట్లాడడంతో ఏదో మంచి వార్త ఉందని అనుకుంది.

ఇంతలోనే పిన్ని గొంతులో స్వల్పంగా మార్పు తోచింది.

"ఓ అలా అన్నారా? గుంటూరు వద్దుటా? సరే, అన్నీ బావున్నాకా తేప్పేదేముంది? అలాగే చేద్దాంలే, అవుననుకో. " ఇలా మాట్లాడుతోంటే అవతల మాట్లాడుతున్నది అమ్మ అని గుర్తించి ఆగలేక నాన్న సెల్‌కి ఫోన్ చేసింది స్ఫురిత. తను రెండునెలల్కిృతం వెళ్ళినప్పుడు అక్కకోసం అనుకుంటున్న సంబంధం అందరికీ నచ్చిందనీ, వచ్చే నెలలో తాంబూలం పుచ్చుకోవడానికి నిర్ణయించారని నాన్న చెప్పినప్పుడు ఎగిరి గంతేసినంత పని చేసింది.

" ఏదీ పెళ్ళికూతుర్ని పిలవండి" ఒకసారి అంది ఆనందంగా. అక్కతో కాసేపు మాట్లాడి పెట్టేసింది ఫోన్. అక్కకతనెంతగా నచ్చాడో, అతనితో కలిసి అమెరికాలో తను గడపబోయే జీవితాన్ని గురించి ఎంత ఉత్సాహంగా ఎదురుచూస్తోందో అక్క మాట్లాడిన ప్రతీ మాటలోనూ కనపడింది.

తర్వాత తను, పిన్నీ ఇద్దరూ చాలా సేపు పెళ్ళి గురించే మాట్లాడుకున్నారు.

"అంతా బానేఉంది కానీ, అబ్బాయి వాళ్ళ అమ్మ ఎంత చెప్పినా పెళ్ళి హైదరాబాద్ లోనే చెయ్యాలని అంటోందిట. మీ అమ్మా, నాన్నలకేమో తెలిసిన ఊరు, కనక గుంటూరులో చేస్తే, మాటకీ, చేతకీ మనుషులు సాయంగా ఉంటారు, ఖర్చూ కాస్త తక్కువ, బావుంటుంది అని ఉంది. ఆవిడ పట్టు వదిలేలా కనపడటంలేదుట. కట్నమన్సలు అక్కర్లేదు, వైభవంగా పెళ్ళి చెయ్యండి అని కండీషన్ పెట్టిందిట. ఈ మధ్యనందరూ ఇదొకటి నేర్చుకున్నారు, కావలసినదేదో కట్నంగా తీసుకుంటేనే నయమనిపిస్తోంది. అదనీ, ఇదనీ తడిసి మోపెడవుతోంది. లాంఛనాలనీ, రకరకాల వేడుకలనీ డబ్బు మంచినీళ్ళలా ఖర్చు పెడుతున్నారు. పేరుకు మాత్రం కట్నం వద్దనడం.కనీసం ఇరవై లక్షలైనా చేత పట్టుకుని దిగాలి" అంది మీ అమ్మ అంది దిగులుగా.

స్ఫురితకెందుకో తెలియకుండానే నవ్వూ, నిట్టూర్పూ కలిసి వచ్చాయి. మహా వైణికుడు నాన్నగారికే కాబోయే బావగారి తల్లి ʽస్ఫురితంʼ వినిపించిందన్నమాట, వద్దంటూనే ʽవరకట్నంʼ అన్న మీటని వినిపించీ వినిపించకుండా నొక్కనే నొక్కింది. మహానగరంలోని జీవితాల్లోనే కాదు, జరగబోయే పెళ్ళిళ్ళలోనూ ఎన్ని వినిపించని రాగాలుంటాయో, అమ్మా, నాన్నా ఎలా తట్టుకుంటారో ?అనుకుంది దిగులుగా.

●●●

Click here to share your comments on this story